క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



వాకతిప్పలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్పలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రారంభించారు. బాటసారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎండల తీవ్రత నేపథ్యంలో గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలని దొరబాబు, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్ కుమార్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూరగాయలు, పాలు, పెరుగు సరఫరాకు టెండర్ల ఆహ్వానం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో నిత్య అన్నదాన పథకానికి కూరగాయలు, పాలు, పెరుగు మే ఒకటి నుంచి 31 వరకు సరఫరా చేయడానికి టెండర్లు స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండరులో పాల్గొనే వారు కూరగాయలకు రూ.ఐదు వేలు, పాలు, పెరుగుకు రూ.ఐదు వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. కూరగాయలకు రూ.ఆరు లక్షలు, పాలు, పెరుగు రూ.ఐదు లక్షల వరకు విలువ ఉంటుందన్నారు. ఈ నెల 15వ తేదీ లోపుగా టెండర్లు వేయాలన్నారు.

స్టోర్ రూమ్‌లో తాచుపాము హల్‌చల్

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలోని ఒక ఇంటి స్టోర్‌రూమ్‌లో శుక్రవారం తాచుపాము హడావుడి సృష్టించింది. ఆ యింటి గృహిణి సుజాత సామాన్లు తీస్తుండగా పాము కనపడడంతో భయపడిపోయింది. దీంతో కాకినాడ నుంచి పాములు పట్టే వ్యక్తిని రప్పించి డబ్బాలో బంధించి దూరంగా తీసుకువెళ్లి వదిలారు.

బసివిరెడ్డి సత్రం పరిశీలన



సామర్లకోట బసివిరెడ్డి సత్రాన్ని పరిశీలించిన ఆర్‌జేసీ

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న కొవ్వూరి బసివిరెడ్డి సత్రాన్ని దేవదాయ శాఖ ఆర్‌జేసీ సురేష్‌బాబు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. సత్రం నిరుపయోగంగా ఉండటంతో దాని స్థలాన్ని లీజుకు ఇవ్వాలనే ఆలోచనతో ఆ వివరాలు సేకరించారు.

దేవస్థానం భూములను..



గొందిలో భూములను పరిశీలిస్తున్న ఈఓ అజాద్, ఏసీ రమేష్ బాబు తదితరులు

అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానానికి వివిధ గ్రామాల్లో ఉన్న వ్యవసాయ భూములను ఆలయ ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ శుక్రవారం పరిశీలించారు. దేవస్థానానికి కాకినాడ రూరల్ మండలంలోని తిమ్మాపురంలో 40.15 ఎకరాలు, శంఖవరం మండలం గొంది గ్రామంలో 34.33 ఎకరాలు, చెందుర్తిలో హైవేను ఆనుకుని 150 ఎకరాలు , సంపర గ్రామంలో 75 సెంట్ల భూమి ఉంది. ఈ భూములను ఈఓ చంద్రశేఖర్ అజాద్ పరిశీలించారు. వీటిలో ఏయే పంటలున్నాయి, కౌలు ఎంత వస్తుంది తదితర విషయాలను అధికారులు ఈఓకు వివరించారు. మిగిలిన గ్రామాల్లోని భూములను కూడా ఆయన శని, ఆదివారాల్లో పరిశీలిస్తారని అధికారులు తెలిపారు. ఈ నెల 18న దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆలయాల భూముల వివరాలపై సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఈఓ ఈ భూములు పరిశీలించినట్టు తెలిపారు. దేవస్థానం ఏసీ రమేష్ బాబు, సూపరింటిండెంట్ బలువు సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పెండెం దొరబాబు



చేబ్రోలులో జెడ్పీటీసీ నాగ లోవరాజు తదితరుల నివాళులు..



గోకివాడ సభలో మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బలరాజు

ఆదర్శనీయుడు అంబేడ్కర్

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు శుక్రవారం పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, దళితసంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు.

- ఘనంగా రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకలు
- ఆయన సేవలను కొనియాడిన నేతలు



వాకతిప్పలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు



మర్లావలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దొరబాబు

కొత్తపల్లి: అందరికీ ఆదర్శనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని కొండెవరం శివారు కాశివారిపాకలు, వాకతిప్ప, రమణక్కపేట గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ మోనిటరింగ్ డివిజన్ కమిటీ సభ్యుడు బండి దావీదు, మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్

పెద్దాపురం: అంబేడ్కర్ జయంతిని శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైస్ చైర్ పర్సన్ కనకాల మహాలక్ష్మి తదితరులు నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జీఎస్ రామారావు, సిబ్బంది అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. మర్లావలో వైఎస్సార్ సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా ఆధ్వర్యంలో హౌసింగ్ చైర్మన్ దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఆంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆవాల లక్ష్మీనారాయణ ఊబా జాన్‌మోజెస్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కరక హిమమహేశ్వరి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి తదితరులు నివాళులు అర్పించారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో యాసలపు సూర్యారావు భవనం నుంచి మున్సిపల్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి మున్సిపల్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సీపీఎం మాజీ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ, సీఐటీయూ నాయకులు నీలపాల సూరిబాబు, డి.క్రాంతికుమార్, సిరిపురపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి

పిఠాపురం: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక జీవన్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. రథాలపేట, అగ్రహారంతో పాటు పిఠాపురంలోని వివిధ ప్రాంతాలు, మండల పరిధిలోని గ్రామాలు, గొల్లప్రోలు నగర పంచాయతీలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పిఠాపురంలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, గండేపల్లి బాబీ, బొజ్జా రామయ్య, పచ్చిమళ్ల అప్పలరాజు, వజ్రపు వీరేష్, బోను దేవ, ఉలవల భూషణం తదితరులు పాల్గొన్నారు. గోకివాడలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బలరాజు, దారా వెంకటరావు ఆవిష్కరించారు. గొల్లప్రోలులో అంబేడ్కర్ విగ్రహాలకు బీజేపీ అధ్యక్షుడు చిట్టా మధు, పసుపులేటి సత్యనారాయణ, దాట్ల వెంకట సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేబ్రోలులో జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, పిఠాపురం పశువుల సంత వద్ద సీఐటీయూ నాయకులు కె.చిన్న, కరణం విశ్వనాథం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

సామర్లకోటలో..

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి, బలుసులపేట, వేట్లపాలెంలోని అంబేడ్కర్ విగ్రహాలకు హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు నివాళులు అర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, మహాత్మ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించి అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనలో భాగంగానే సీఎం జగన్ బడుగు, బలహీన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్ సీఎంఎ నయీం అహ్మద్, ఎంపీడీఓ డి శ్రీలలిత, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, వైస్ చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, అన్నవరం దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పట్టణంలో పలుచోట్ల అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు.

స్థానిక బ్రౌన్‌పేట అంబేడ్కర్ పార్కులో అంబేడ్కర్ సంఘ అధ్యక్షుడు పిట్టా సత్యానారాయణ, బళ్లమార్కెట్ సెంటర్‌లో ఆలిండియా మాదిగ డెవలప్‌మెంట్ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు కాపవరపు కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాసు ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. పట్టణ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసు, వీఆర్వోలు పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ ఆవరణలోని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. యూనియన్ అధ్యక్షుడు డి.నాయక్, కార్యదర్శి దొరబాబు, కోశాధికారి ప్రేమ్‌కుమార్‌లు పాల్గొన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ ఈ కృష్ణమోహన్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి



పెద్దాపురం ఇఫ్తార్ విందులో హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక కవాడీ వీధి జామియా మసీదులో శుక్రవారం రాత్రి అగ్రో డైరెక్టర్ సయ్యద్ కరీమ్ (జానీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వార్డు కౌన్సిలర్ సయ్యద్ అమీనా బీబీ, రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, కౌన్సిలర్లు విడదాసిరి రాజా, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగా, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు రమేష్ ఘనపాఠి, సుధీర్, చిట్టెం వాసు, చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 38 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

ముగిసిన శిక్షణ తరగతులు

అన్నవరం: రత్నగిరిపై అర్చకులు, వ్రతపురోహితులకు దేవదాయ, ధర్మాదాయశాఖ, అర్చక ట్రైనింగ్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సభలో దేవస్థానం ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు, అర్చక ట్రైనింగ్ అకాడమీ చీఫ్ కోఆర్డినేటర్ డీవీఎం చక్రవర్తి, ద్వారకాతిరుమల ఆస్థాన సిద్ధాంతి పైతపల్లి బాలసుబ్రహ్మణ్య శర్మ, దేవదాయశాఖ ఆగమ సలహాదారు చిర్రావూరి శ్రీరామశర్మ పాల్గొని అర్చకులకు పలు సూచనలు చేశారు. శిక్షణ పొందిన పురోహితులు, అర్చకులకు సర్టిఫికెట్లు అందజేశారు.

గ్రామాల్లో జోరుగా జగనన్నే మా భవిష్యత్తు



రావివారిపోడులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పవర గ్రామంలో 'జగనన్నే మా భవిషత్తు'లో పాల్గొన్న ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు

కొత్తపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. పొన్నాడ శివారు రావివారిపోడులో మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ముమ్మిడి గోవిందు, బావిశెట్టి నారాయణస్వామి, రావి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: జగనన్నే మా భవిషత్తు కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోందని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. మండల పరిధిలో పవర గ్రామంలో జగనన్నే మా భవిషత్తు నిర్వహణను ఆయన పరిశీలించారు. తమకు ఎటువంటి ఆస్తి లేని సమయంలో పిల్లలకు విద్య అనే ఆస్తి ఇచ్చేలా జగన్ తోడ్పడుతున్నారని లబ్ధిదారులు చెప్తున్నారని ఎంపీపీ తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో, పట్టణ పరిధిలో అన్ని వార్డుల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు గృహసారథులతో కలిసి 'జగనన్నే మా భవిషత్తు' నిర్వహిస్తున్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

సామర్లకోట: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల స్థాయి సీఐటీయూ నాయకత్వ శిక్షణ తరగతులలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలతో దేశం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. సీఐటీయు నాయకులు విప్పర్తి కొండలరావు, ఎ.అమలావతి, టి నాగమణి, ఎస్‌కె ఫాతిమా, మహాలక్ష్మి, వి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ షెడ్ ప్రారంభం

సామర్లకోట: స్థానిక మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో పార్కింగ్ షెడ్‌ను హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రారంభించారు. సుమారు రూ.10 లక్షల అంచనాతో దీనిని నిర్మించారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీలు పేర్నిడి వెంకట్రాయుడు, ములసా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉడికిస్తున్న ఉష్ణోగ్రతలు

- ఠారెత్తిస్తున్న ఎండలతో జనం అవస్థలు
- రెండు రోజులుగా 43 డిగ్రీల వరకు నమోదు
- ఇళ్లకే పరిమితమవుతున్న వృద్ధులు, చిన్నారులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యాధికారులు



వేసవి తీవ్రతతో నిర్మానుష్యంగా మారిన ప్రత్తిపాడు-సామర్లకోట రోడ్డు

పెద్దాపురం: నియోజకవర్గంలో ఎండలు అల్లాడిస్తున్నాయి. సుమారు 40 నుంచి 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవడంతో జనాలు బయటకు రావడాని జంకుతున్నారు. వాహనచోదకులు, పాదచారులు ప్రయాణం మధ్యలో ఎక్కడైనా చెట్ల నీడలు, శీతల పానీయాల దుకాణాలు కనపడగానే ప్రయాణానికి బ్రేకులు వేసి కాస్త సేదతీరి మళ్లీ వారి గమ్యాలకు బయలుదేరుతున్నారు.

వడగాడ్పులపై అప్రమత్తం..



ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దష్ట్యా డివిజన్‌లోని ప్రజలు వడగాల్పులపై అప్రమత్తంగా ఉండాలి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలి. వ్యాపారులు మధ్యాహ్నం 12 గంటలకు దుకాణాలు మూసివేసి తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు తెరచుకోవాలి. వాహనచోదకులు తగు జాగ్రత్తలు పాటించి తలమీద టోపీ, చెవులకు క్లాత్ ధరించుకోవాలి.

– జీఎస్ రామారావు, ఆర్డీఓ, పెద్దాపురం

చల్లటి పానీయాలు సేవించాలి



వేసవిలో ఆరోగ్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వేసవి ఉపశమనానికి ప్రతి ఒక్కరూ మజ్జిగ, బార్లీ, చల్లటి ద్రవాలు సేవించి ఆరోగ్యాలను కాపాడుకోవాలి. వేసవి తాపం ఎక్కువ కావడంతో ప్రజలు సాధ్యమైనంత వరకు ఎండలో తిరగకుండా 11 గంటల లోపే తమ పనులు ముగించుకోవాలి. వేడి తగలకుండా శరీరానికి వదులు, కాటన్ దుస్తులను వేసుకోవాలి. వైద్యులు సూచించే ఆరోగ్య సూత్రాలు పాటించాలి.

– డాక్టర్ ఎన్.సుదీప్తి, ఏరియా ఆసుపత్రి వైద్యులు, పెద్దాపురం

శునకాలకు వేగంగా వ్యాక్సినేషన్

పెద్దాపురం: పట్టణంలో వీధి కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సినేషన్ వేగవంతం చేసినట్లు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.దావీదురాజు తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఆయా వార్డుల్లోని వీధుల్లో తిరుగుతున్న వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు.

నేడు మేడపాడులో ఆసరా

సామర్లకోట: మహిళా సంఘాలకు మూడో విడత ఆసరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, గ్రామ సర్పంచ్ పటాని దేవి శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.